

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 02-08-2025 | సంపుటి - 24 | సంచిక - 88 | రూ : 4 | పేజీలు:




### ఓ మహిళ ఇంటికి వెళ్లి స్వయంగా వితంతు పింఛను అందించిన సీఎం

- నేడు ఒకటో తారీఖు
- రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ సందడి
- జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలో చంద్రబాబు పర్యటన
- ఓ కుటుంబంతో ఆత్మీయంగా ముచ్చటించిన సీఎం చంద్రబాబు

ఇవాళ ఆగస్టు 1వ తేదీ కాగా, రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ సందడి నెలకొంది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు

తరువాయి 2లో

### సమస్యలపై పోరాటంలో

# కమ్యూనిస్టులది అగ్రభాగం

### అధికారంలో ఉన్నవారిని దించడంలోనూ ముందుంటారు

- వంటకంలో ఉప్పు లాంటి వారు...వారు లేకుంటే రాజకీయాలు లేవు
- దిగజారుతున్న జర్నలిజం విలువలు...సోషల్ మీడియా పేరుతో అరాచకాలు
- నవ తెలంగాణ దశమ వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

2లో





# జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా

- నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదల
- ఆగస్టు 7న నోటిఫికేషన్, 21న నామినేషన్‌కు చివరి తేదీ
- సెప్టెంబర్ 9న నూతన ఉప రాష్ట్రపతి కోసం ఎన్నిక
- అదే రోజు లెక్కింపు.. ఫలితాల ప్రకటన

నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 9న నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయగా, దానిని రాష్ట్రపతి ఆమోదించడంతో నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది.

తరువాయి 2లో

### గండికోట దశ మార్చే ప్రణాళిక..

# యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు



- నేడు గండికోట ప్రాంతాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు
- గండికోట సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల కోసం రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు
- 'సాస్కీ' పథకం కింద రూ.78 కోట్ల ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన
- అంతర్జాతీయ హంగులతో స్టార్ హోటళ్లు, రోప్‌వే, గ్లాస్ వాక్‌వే ఏర్పాటుకు నిర్ణయం
- డిసెంబరు 26, 27 తేదీల్లో గండికోట ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక పర్యాటక కేంద్రమైన గండికోటను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం కడప జిల్లాలోని గండికోటలో నిర్వహించిన 'ఏపీ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక రంగంలోకి రూ.500 కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షిస్తూ కీలక ఒప్పందాలు జరిగాయి.

తరువాయి 2లో

### 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాక్ కొత్త వ్యూహం...

# నిఘా వర్గాల సంచలన నివేదిక!

### ఆపరేషన్ సిందూర్ దెబ్బతో పాకిస్థాన్ కొత్త కుట్ర

- పీవోకేలో 15 కొత్త ఉగ్ర శిబిరాల నిర్మాణం
- నిఘా వర్గాలకు చిక్కకుండా కొత్త టెక్నాలజీ వినియోగం
- ఆర్మీ స్థావరాల సమీపంలో టెర్రర్ క్యాంపుల ఏర్పాటు
- చిన్న చిన్న గ్రూపులుగా ఉగ్రవాదులకు శిక్షణ
- చొరబాట్లకు సిద్ధం కావాలంటూ ఉగ్రమూకలకు ఆదేశాలు

2లో



### కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక..

# అధ్యయనానికి కమిటీ ఏర్పాటు



- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు
- పీసీ ఘోష్ కమిషన్ ను నియమించిన రేవంత్ సర్కారు
- నివేదిక సమర్పించిన కమిషన్
- నీటిపారుదల శాఖ, న్యాయ శాఖ, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శులతో అధ్యయన కమిటీ

2లో

## జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా.. నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టు 7న నోటిఫికేషన్ విడుదల, 21న నామినేషన్ దాఖలుకు చివరి తేదీ, 22న స్క్రూటినీ ఉంటుంది. ఆగస్టు 25వ తేదీ వరకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంటుంది. సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేసినట్లు ఆయన రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకు పదవీ కాలం ఉంది. ఆయన రెండేళ్ల ముందే వైదొలిగారు. పార్లమెంటు ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య మొత్తం 786. మెజారిటీకి 394 మంది సభ్యుల మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలం ఉంది. రాజ్యసభలో 129 మంది మద్దతు ఉంది. ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాక్ కొత్త వ్యూహం... నిఘా వర్గాల సంచలన నివేదిక!

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు పాకిస్థాన్ మరోసారి భారీ కుట్రకు తెరలేపింది. భారత బలగాల దాడుల్లో దెబ్బతిన్న ఉగ్రవాద శిబిరాలను తిరిగి నిర్మిస్తోందని, ఇందుకోసం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను వేదికగా చేసుకుందని భారత ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) సంచలన నివేదిక వెల్లడించింది. పీవోకేలో దాదాపు 15 కొత్త ఉగ్ర శిబిరాలు, చొరబాట్లకు ఉపయోగించే ల్యాంచ్ ప్యాడ్‌లను నిర్మిస్తున్నట్టు స్పష్టం చేసింది. గత ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం, మురిద్కేలోని లష్కరే తోయిబా శిక్షణా కేంద్రం వంటి కీలక స్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేశాయి. ఈ నష్టం నుంచి తేరుకునేందుకు పాక్ ఆర్మీ, నిఘా సంస్థ ఐఎస్ఐ ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నాయని ఐబీ నివేదిక పేర్కొంది. ఈసారి ఉగ్ర శిబిరాలను పాత ప్రదేశాల్లో కాకుండా పాకిస్థాన్ సైనిక స్థావరాలకు సమీపంలో నిర్మిస్తున్నారు. భారత బలగాలు సులభంగా దాడి చేయలేని ప్రాంతాలను ఎంచుకుంటున్నారని నిఘా వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా, భారత నిఘా ఏజెన్సీల రాడార్లకు చిక్కకుండా ఉండేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. శిబిరాల్లో ఉగ్రవాదుల సంఖ్యను కూడా పరిమితం చేస్తున్నారు. ప్రతి క్యాంపు లేదా ల్యాంచ్ ప్యాడ్‌లో 20 నుంచి 25 మందికి మించి ఉగ్రవాదులు ఉండకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ కుట్రలో భాగంగా లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్ర సంస్థలన్నీ కలిసికట్టుగా పనిచేస్తున్నాయని, పాక్ అధికారులు వీటికి పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిసింది. పాకిస్థాన్‌లో కొత్తగా ఉగ్రవాదుల రిక్రూట్‌మెంట్‌ను భారీగా చేపట్టినప్పటికీ, జమ్మూకశ్మీర్‌లో స్థానికులను నియమించుకోవడం మాత్రం వారికి కష్టంగా మారింది. భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండటంతో స్థానిక నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. 'ఆపరేషన్ సిందూర్' ఇంకా కొనసాగుతోందని, పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీవోకేలో పెరుగుతున్న ఉగ్ర కదలికలపై భారత భద్రతా దళాలు పూర్తి అప్రమత్తతతో ఉన్నాయి.

## కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక... అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

తెలంగాణలోని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై తదుపరి చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేసి, సారాంశాన్ని సిద్ధం చేయడానికి ప్రభుత్వం శుక్రవారం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో నీటిపారుదల శాఖ, న్యాయ శాఖ, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఆగస్టు 4న రాష్ట్ర మంత్రిమండలికి తన నివేదికను సమర్పించనుంది. ఆ తర్వాత క్యాబినెట్ సమావేశంలో ఈ నివేదికలోని సిఫార్సులు, అంశాలపై చర్చించి, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. సుమారు 700 పేజీల నివేదికను పీసీ ఘోష్ కమిషన్ గురువారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. అనంతరం శుక్రవారం ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ముఖ్యమంత్రి చర్చించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను ఈ నివేదిక ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా దోషులుగా తేలిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలా లేదా అనే దానిపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే, తప్పు చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోం

## ఓ మహిళ ఇంటికి వెళ్లి స్వయంగా వితంతు పింఛను అందించిన సీఎం

(మొదటిపేజీ తరువాయి)

మండలం గూడెంచెరువు గ్రామంలో ఉల్సాల అలివేలమ్మ అనే లబ్ధిదారు ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వెళ్లి వితంతు పింఛన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన అలివేలమ్మ కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలివేలమ్మ పెద్ద కుమారుడు వేణుగోపాల్ చేనేత కార్మికుడు. సీఎం ఆయన మగ్గాన్ని పరిశీలించారు. వేణుగోపాల్ తన కుమారుడు హర్షవర్ధన్ (6)కు 'తల్లికి వందనం' పథకం కింద లబ్ధి చేకూరినట్లు సీఎంకు వివరించారు. అనంతరం అలివేలమ్మ చిన్న కుమారుడు, ఆటో డ్రైవర్ జగదీశ్‌తో చంద్రబాబు మాట్లాడారు. అనంతరం, జగదీశ్ ఆటోలో సీఎం చంద్రబాబు ప్రజావేదిక వద్దకు ప్రయాణించారు. ఈ ప్రయాణంలో ముఖ్యమంత్రి ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా చేరువవుతున్నాయో స్వయంగా తెలుసుకోవడానికి సీఎం చంద్రబాబు ఈ పర్యటన చేపట్టారు. ఇంటివద్దే పింఛన్ అందించి లబ్ధిదారుల ఇబ్బందులను తెలుసుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.





## రాష్ట్రవ్యాప్తంగా 1,16,000 క్రొత్త వితంతు పెన్షన్లను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిది

**– తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వైవీబి. రాజేంద్రప్రసాద్.**



ఈరోజు ఉయ్యూరు నగర పంచాయితీ 15,17 వార్డుల్లో కూటమి ప్రభుత్వం నూతనంగా ఇస్తున్నటువంటి పెన్షన్లను లబ్ధిదారులకి ఇచ్చి చంద్రబాబు నాయుడు గారు అమలు చేస్తున్న సంక్షేమం గురించి వివరించిన రాజేంద్రప్రసాద్ గారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ... మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఏదైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పెన్షన్లు 4000 చేస్తానని, చేసి చూపించారని, అలాగే భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోతే ఆ పెన్షన్ను వెంటనే భార్యకు ఇవ్వాలని ఈరోజు క్రొత్తగా 1,16,000 వేల పెన్షన్లను ఇవ్వడం జరుగుతోందని రాజేంద్రప్రసాద్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, 15 వార్డ్ అధ్యక్షుడు తిరుపతిరావు, రవి, నజీర్, నాగరాజు, రాము, చింతయ్య, శ్రీకాంత్, నరసింహారావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు

## గండికోట దశ మార్చే ప్రణాళిక.. యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న సీఎం



భారతదేశ గ్రాండ్ కాన్యన్‌గా ప్రసిద్ధి చెందిన గండికోటను ఒక ప్రధాన 'యాంకర్ హబ్'గా తీర్చిదిద్దనున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ 'సాస్కీ' పథకం కింద రూ.78 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పర్యాటకులను ఆకట్టుకునేందుకు వ్యూ పాయింట్, ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్, కోట వద్ద ప్రత్యేక లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్టు వివరించారు. ఈ ఏడాది చివరికల్లా టెంట్ సిటీని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.పెట్టుబడిదారుల సదస్సులో భాగంగా హిల్టన్ హోటల్స్, ఈజ్ మై ట్రిప్ వంటి ప్రముఖ సంస్థలతో ఏపీ టూరిజం కార్పొరేషన్ అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా గండికోటతో పాటు శ్రీశైలం, మంత్రాలయం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాల్లో స్టార్ హోటళ్ల నిర్మాణంతో పాటు అడ్వెంచర్ స్పోర్ట్స్, కయాకింగ్, జెట్ స్కీయింగ్ వంటి ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదుల నిర్మాణమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. గండికోటలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు రోప్‌వే, గ్లాస్ బాటమ్ వాక్‌వే, లైట్ అండ్ సౌండ్ షోలను ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సెప్టెంబరు నుంచే ఆకాశం నుంచి గండికోట అందాలను వీక్షించేందుకు హెలిరైడ్స్ సేవలను ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి కారావాన్ టూరిజం సర్వీసులను కూడా అందుబాటులోకి తెస్తామని తెలిపారు. విశాఖ, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోటలను 7 యాంకర్ హబ్ లు గా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. అలాగే 25 థీమాటిక్ సర్క్యూట్ లను కూడా ప్రకటించామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలను కూడా ప్రోత్సహిస్తామని అన్నారు. రాష్ట్రస్థాయిలో 8 పర్యాటక ఈవెంట్లను నిర్వహించటంతో పాటు జిల్లాల వారీగానూ కార్యక్రమాలు, టూరిజం ఫెస్టివల్స్ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాజెక్టులకు పా రిశ్రామిక హోదా కల్పిస్తున్నామని, పెట్టుబడిదారులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అంతకుముందు ముఖ్యమంత్రి గండికోట ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడి పర్యాటకులు, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డిసెంబరు 26, 27 తేదీల్లో గండికోట ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.

## బిహార్‌లో ముసాయిదా జాబితా.. 65లక్షల ఓటర్లు 'మిస్సింగ్'!




బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తైన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ముసాయిదా జాబితా విడుదలయ్యింది. ఇందులో మొత్తంగా 65లక్షల ఓటర్లను చేర్చలేదని వెల్లడైంది. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, తాజా ముసాయిదాలో అది 7.24కోట్లకు తగ్గింది. రాజధాని పట్నాలో అత్యధికంగా 3.95లక్షలు, మధుబనీలో 3.52 లక్షలు, ఈస్ట్ చంపారన్‌లో 3.16లక్షలు, గోపాల్‌గంజ్‌లో 3.10లక్షల ఓటర్లు సంబంధిత దస్త్రాలను అందించకపోవడంతో వారిని ఈ జాబితాలో చేర్చలేదని ఈసీ వెల్లడించింది. మొత్తం జాబితాలో 22.34లక్షల మంది ఓటర్లు చనిపోయారని, 36.28లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం లేదా ఆయా చిరునామాలో లేరని ఈసీ గుర్తించింది. మరో 7.01 లక్షల మంది ఒకటి కన్నా ఎక్కువసార్లు నమోదు చేసుకున్నట్లు గుర్తించామని తెలిపింది. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఎన్నికల సంఘం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో ముసాయిదా జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. దీనిని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేసింది. తాజాగా ఓటర్లకు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా ఈసీకి తెలియజేయవచ్చు. ఆ తర్వాత ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురిస్తుంది. ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఆర్జేడీ వంటి విపక్ష పార్టీలు ఈ ముసాయిదాపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయేకు అనుకూలంగా ఉండేందుకే దీన్ని చేపట్టాయని ఆరోపిస్తూ రాజధాని పట్నాలో నిరసన తెలిపాయి.

## రాహుల్ గాంధీ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన శశిథరూర్

దిల్లీ: భారత్, రష్యా సంబంధాలపై అక్కసు వెళ్లగక్కుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీ ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో విభేదిస్తున్నానని చెప్పారు. భారత్, రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతనమయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోనీయండంటూ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ట్రంప్ విమర్శలను శశిథరూర్ కొట్టిపారేశారు. భారత ఆర్థిక స్థితి ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. ట్రంప్‌ను రాహుల్ సమర్థించడంపై పార్లమెంట్ వెలుపల మీడియా ప్రశ్నించగా ఈ మేరకు స్పందించారు. రష్యాతో భారత్ ఏం చేస్తుందన్న విషయాన్ని అసలు పట్టించుకోబోమని, వారిద్దరూ మునిగిపోతుంటే మాకెందుకని, మిగిలిన అందరి గురించి పట్టించుకుంటామని ట్రంప్ పోస్టు చేసిన విషయం తెలిసిందే. ''భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలున్నప్పటికీ.. ఆ దేశంతో స్వల్ప లావాదేవీలే ఉన్నాయి. ఆ దేశం విధిస్తున్న సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో దాడులు ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తి అరుస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి ఆయుధాలను, ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది'' అని ట్రంప్ చిర్రుబుర్రులాడారు. ఆ పోస్టుపై రాహుల్ స్పందిస్తూ.. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ నిజం మాట్లాడారని అన్నారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్‌కు చెందిన మరో ఎంపీ కార్తి చిదంబరం కూడా రాహుల్ వ్యాఖ్యలను సమర్థించలేదు. కానీ, ట్రంప్ ఓ సంప్రదాయేతర రాజకీయ నాయకుడంటూ చురకలు అంటించారు.




## ప్రభుత్వ పథకాల్లో వాళ్ల పేర్లు, ఫొటోలు వాడొద్దు: మద్రాస్ హైకోర్టు

పథకాల్లో వాడే పేర్ల విషయంలో తమిళనాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా తీసుకువచ్చే ప్రజా సంక్షేమ పథకాల్లో జీవించి ఉన్న నేతల పేర్లు వాడొద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే వాటి గురించి ప్రచారం చేసేటప్పుడు మాజీ ముఖ్యమంత్రుల చిహ్నాలు, డీఎంకే పార్టీ గుర్తులు, జెండాను ఉపయోగించకుండా నిషేధించింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అన్నాడీఎంకే పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మద్రాస్ హైకోర్టులో తాజాగా విచారణ జరిగింది. 'Ungaludan Stalin' పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పేరును ఉపయోగించడాన్ని షణ్ముగం సవాల్ చేశారు. ఈ అంశంపై తాము ఇచ్చిన ఉత్తర్వులు ఏ ప్రభుత్వ పథకం ఆవిష్కరణ, అమలుకు అడ్డంకి కాబోదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యాజ్యంపై రాష్ట్ర ప్రభుత్వం, డీఎంకే పార్టీ తమ స్పందనలు తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

# తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి

*** జిల్లా ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శుక్రవారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు 2025 గోడపత్రికలను ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది అని,ఈ సందర్భంగా జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు, తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని పుట్టిన ప్రతి బిడ్డకు మొదటి గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు పట్టాలని,అలాగే బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం అని, దీనిని ప్రతి తల్లి పాటిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బంది, ఆశాలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలు, డి ఆర్ డి ఏ, లైన్ డిపార్ట్మెంట్లు సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ట్రేని కలెక్టర్ సౌరభ్ శర్మ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ని ఆవిష్కరించి వారం రోజుల షెడ్యూల్ను విడుదల చేయడం జరిగింది. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏ రోజు ఏం చేయనున్నారు దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 1న ప్రతి అంగనవాడి



కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. ఇందులో తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తారు, రెండవ తేదీన ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతను తల్లులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు, నాలుగో తేదీన అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి అంగనవాడి టీచర్స్, ఆశా వర్కర్లు బ్రెస్ట్ ఫీడింగ్ పై అవగాహన కల్పిస్తారు. ఐదో తేదీన ఇంటింటికి వెళ్లి తల్లిపాల ప్రాధాన్యతపై ప్రచారం చేస్తారు, 6న చేతులను శుభ్రం చేసుకునే అంశంపై అవగాహన కల్పిస్తారు. ఏడోవ తేదిన స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా, సెర్ప్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, బ్రెస్ట్ ఫీడింగ్ పై విస్తృత అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయలక్ష్మి, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పి.సంపత్, సూపర్వైజర్ రమా దేవి పోషణ అభియాన్ జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ బి. రాము, బ్లాక్ కోఆర్డినేటర్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సీఐగా బాధ్యతలు చేపట్టిన టీ.సురేష్ కుమార్ గౌడ్ ను కలిసిన టీడీపీ నేతలు



ప్రజాస్ఫూర్తి ,ఇల్లందు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పోలీస్ స్టేషన్ లో, నూతనంగా ఎస్హెచ్ఓ గా భాధ్యతలు స్వీకరించిన తాటిపాముల సురేష్ కుమార్ గౌడ్ ను ఇల్లందు తెలుగుదేశం పార్టీ ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో, మర్యాద పూర్వకంగా, కలిసి, శాలువతో సత్కరించి, పుష్పగుచ్చం అందించి, ఇల్లందుకు వచ్చినందుకు వారికి ప్రత్యేక స్వాగతం తెలిపారు.ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణతో కలిగిన నాయకులు కార్యకర్తలు ఉన్నారు అని లా అండ్ ఆర్డర్ కు సహకరించి తమ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాందావత్ రమేష్ బాబు, టిడిపి పట్టణ సహన కార్యదర్శి దశావత్ శ్రీహరి టిడిపి సీనియర్ నాయకులు కారు నర్సన్న, అయ్యోరి నాగరాజు, మైపా బాలరాజు, దగ్గుల లింగయ్య, కంది రవి, టిఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు దాసరి గోపాలకృష్ణ,పొదిలా శ్యామ్, గోగేలా రాజేష్, దేవరకొండ నవీన్,ముక్కు శ్రీవెద్,వాసం వినీత్,చిటికెలా క్రాంతి, చిన్నా, పాల్గొన్నారు.

## నూతన ఆపరేషన్ ధియెటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సిబ్బందితో కలిసి మొక్కలు నాటి,ఆసుపత్రిలో ప్రసుతి చెందిన మహిళ ల వద్ధకు వెళ్ళి అందిస్తున్న వైద్యం వివరాలు,వెలుసుబాటులు అడిగి తెలుసుకొని నూతనంగా ఏర్పాటు చేసిన నూతన ఆఫరేషన్ ధియెటర్ ను ఫ్రారంభించిన ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య వారి వెంట పాల్గోన్న ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు.వారితో పాటు డిసిహెచ్స్ డాక్టర్ రవి బాబు,మెడికల్ సూపర్డెంట్ హర్షవర్ధన్,ఆర్ఎంఓలు రాంనివాస్,షకీర్,నర్సింగ్ సూపర్డెంట్ ఫర్జానా,సానిటేషన్ సూపర్వైజర్, జగధీష్, మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు,నాయకులు మాడుగుల సాంబమూర్తి,తాటి భిక్షం,మూతి క్రిష్ణ,హరిహర క్షేత్రం చైర్మెన్ గందె సదానందం తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా కూన వెంకటేష్ గౌడ్ విగ్రహా ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,దివంగత నేత కూన వెంకటేష్ గౌడ్ సేవలు,జ్ఞాపకాలు చిరుకాలం ప్రజల మదిలో ఉంటాయని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. వెంకటేష్ గౌడ్ కుమారులు కూన శ్రావణ్ గౌడ్, కూన గౌరిశంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు గాజులరామారంలో కెవిఎస్ కన్వెన్షన్ లో స్వర్గీయ.కూన వెంకటేష్ గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా కెవిఎస్ కన్వెన్షన్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కూన అంత్తయ్య గౌడ్ లు పాల్గొని కూన వెంకటేష్ గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.కూన వెంకటేష్ గౌడ్ జ్ఞాపకార్థంగా తన కుమారులు శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి బంగారు తోరణలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, కూన కుటుంబ సభ్యులు, నాయకులు, ప్రజలు, వెంకటేష్ గౌడ్ అభిమానులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల షాపులను తొలగించొద్దు

*** మున్సిపల్ అధికారులకు సూచించిన కార్పొరేటర్ కొలుకుల జగన్**

ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్, రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబందించిన చిరు వ్యాపారులు తమ జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న వ్యాపార (డబ్బాలు) షాపులను తొలగించొద్దని శుక్రవారం స్థానిక కార్పోరేటర్ కొలుకుల జగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ కుటుంబాలకు చెందిన నిరుపేదలు రాజీవ్ గృహకల్ప స్థలం సర్వేనెంబర్ 348/1 లో వార్డ్ కార్యాలయం పక్కన, మసీదుకు ఎదురుగా గల స్థలంలో తమ జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపార (డబ్బాలు) షాపులను ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోసించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కాని ప్రస్తుతం జిహెచ్ఎంసి అధికారులు షాపులకు ఇబ్బంది కలుగకుండా చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణపనులను అర్ధాంతరంగా ప్లాన్ మార్చి (డబ్బాలు) షాపులను తొలగించి ప్రహరీ గోడ నిర్మించే ప్రయత్నం చేస్తున్నందున ఆలా తొలగిస్తే చిరువ్యాపారులు తమ జీవనోపాధి కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి నెలకొంటుందన్నారు. కాబట్టి అట్టి పనులను వెంటనే నిలిపివేసి, చిరువ్యాపారుల (డబ్బాలు) షాపులను తొలగించకుండా వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఎధావిధిగా గత ప్లాన్ ప్రకారం నిర్మిస్తున్న ప్రహరీగోడా పనులను కొనసాగించాలని అధికారులకు సూచించారు. చిరు వ్యాపారాలను యెధావిధిగా కొనసాగించుకుని తమ జీవనాన్ని కొనసాగించుకునే విధంగా మునిసిపల్



అధికారులు సహకరించాలని కోరారు. అందుకు మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించి తప్పకుండా చిరువ్యాపారులకు ఇబ్బంది కలుగకుండా వారి (డబ్బాల) షాపుల వెనకనుండి గత ప్లాన్ ప్రకారం ప్రహరీ గోడ నిర్మిస్తామని, వారికి న్యాయం జరిగేవిదంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీకే నాయకులు, సంక్షేమ సంఘం నాయకులు, చిరువ్యాపారులు ధర్మారపు అంజయ్య, భాన్సాద వెంకటేష్, నాగభూషణం, ఇస్తారీ, నర్సింహా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ –XI వ విడుతలో 54 మంది బాలకార్మికులకు విముక్తి

**: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ XI విడుతలో జిల్లా వ్యాప్తంగా 54 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.ఆపరేషన్ ముస్కాన్ XI విజయవంతం కోసం జిల్లాలో 05 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.ఇందులో భాగంగా జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ XI కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది.ఇందులో 54 మంది బాలకార్మికులను గుర్తించడమైనదని తెలిపారు.ఇందులో 44 మంది మగ పిల్లలు,10 మంది బాలికలు ఉన్నారని తెలిపారు.ఈ 53 మందిని వారి తల్లిదండ్రులకు, ఒకరిని హోమ్ కి అప్పగించడం జరిగిందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 39 మంది




వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని,13 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 కి ఫోన్ చేసి పోలీసు వారికి సమాచారం అందించాలని తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్ XI లో భాగంగా బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించిన ప్రత్యేక బృందాల సభ్యులను ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

## కొత్తగూడెం ఎంఈఓను ప్రశంసించిన రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగిత రాణా ఇటీవలే ఆకస్మికంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను సందర్శించి పలు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు.అనంతరం మూడు గంటలపాటు పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) డాక్టర్ ప్రభుదయాల్ పనితీరుపై ప్రత్యేకంగా ప్రశంసలు లభించాయి. రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్.ఎమ్‌గా విధులు నిర్వహిస్తూనే, మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను క్రమంగా సందర్శిస్తూ, ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తూ, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ముందంజలో ఉన్నారని ఆమె లేఖ ద్వారా అభినందించారు. పదో తరగతి ఫలితాలలో అత్యుత్తమ విజయాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ఉపాధ్యాయునిగా, హెడ్‌మాస్టరుగా, ఎంఈఓగా సమర్థవంతంగా పనిచేస్తూ విద్యారంగ అభివృద్ధి కోసం పలు పరిశోధనా పత్రాలు, సూచనలు సమర్పించడం కూడా ప్రశంసనీయం అని పేర్కొన్నారు.గతంలో గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలంలో ప్రిన్సిపల్‌గా పనిచేసి, ఆ కళాశాల ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలిపిన ఆయన, మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవలందిస్తూ ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీ బాసర సీట్లు సాధనలో విశేష కృషి చేశారు. తరువాత మేదరబస్తీ పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, ప్రస్తుతం రామవరం ప్రభుత్వ హైస్కూల్‌తో పాటు కొత్తగూడెం మండల విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి చే గుర్తింపు పొందారు.



## శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : శ్రావణ శుక్రవారం సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లో గల శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయం వద్ద అన్న దాత కన్నమ్మ గోవింద్ స్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాలనీ అధ్యక్షులు జల్దా రాఘవులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజేందర్, ఎల్లయ్య, రవి, సాయి గౌడ్, లక్ష్మి నాథ్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, నర్సింహా,తిమ్మయ్య, నవీన్, విజయ్, వెంకట్ సాయి, బిక్షపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు..

## గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యం

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గుర్తు తెలియని మగ వ్యక్తి శవము లభ్యమైన సంఘటన పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...గుండ్ల పోచంపల్లి లోని ఏజీ కాలనీ లో గల ఖాళీ ప్లాట్ లోని చెట్ల పొదల్లో సుమారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్యలో ఉన్న ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి పడి ఉంది. ఇట్టి వ్యక్తి మొహం గుండ్రంగా ఉన్నది గ్రీన్ కలర్ ఫుల్ షర్ట్ , కాఫీ కలర్ క్లాత్ పాయింట్ ధరించి ఉన్నాడు ఇతను చనిపోయి సుమారు వారం రోజులు అయి ఉండవచ్చునని ఇట్టి వ్యక్తి యొక్క వివరములు ఎవరికైనా తెలిస్తే పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ కి 8712663248, 9490617229 సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



దుండిగల్, (ప్రజాస్ఫూర్తి) : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పోరాట ఫలితంగానే ప్రధాన రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

*** మున్సిపల్ , ఆర్ అండ్ బి అధికారులకు అభినందనలు తెలిపిన సిపిఎం నేతలు, బస్తి వాసులు..**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రధాన రహదారి పనులు పరిశీలించిన సీపీఎం నాయకత్వం. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణంలో ఉన్న ప్రధాన రహదారి సెవెన్ హిల్స్ నుండి సింగరేణి ఆసుపత్రి వరకు ఉన్న పెండింగ్ లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలతో సంతకాల సేకరణ, బస్తీలో ధర్నా నిర్వహించడం, చివరికి మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ఫలితంగ రోడ్డు విస్తరణ పనులు సంబంధిత అధికారులు వేగవంతం చేశారన్నారు. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాకపోవడం వల ప్రజలు అనేక సమస్యలు పడ్డారని భూక్య రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం చేసిన సంబంధిత అధికారులకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎన్ఎస్ రాజు ,శాఖ కార్యదర్శి గూగులోత్ సక్రాం, గిరి, విజయమోహన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు



* **యూరియా పక్కదారి పట్టకుండా చూడాలి.**
* **సరైన ఆధారాలు లేకుండా యూరియా సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం...**
* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో వ్యవసాయ, సహకార శాఖ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో యూరియా నిల్వలు, సరఫరా, వినియోగ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, పంటల సాగుకు అవసరమైనంత సరఫరా చేయడానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయడం వల్ల కృత్రిమంగా డిమాండ్ పెరిగినట్టు కనిపిస్తోందని, దీని వల్ల అయోమయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. యూరియాను పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాల కోసం మళ్లించరాదని, అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఏ ఒక్కరు కూడా దుర్వినియోగానికి పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.యూరియా పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి సప్లై ఆధార్ నెంబర్ ఆధారంగా నమోదు కావాలని కలెక్టర్ సూచించారు. ఆధారాలు లేకుండా యూరియా సరఫరా చేసిన అధికారులపై తగిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైనంత మేరకు మాత్రమే యూరియా ఇవ్వాలని, నిల్వలు నిరంతరం తనిఖీ చేస్తూ సంబంధిత నివేదికలు సమర్పించాలని సూచించారు. రైతులు యూరియాకు బదులుగా నానో యూరియా ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు . నానో యూరియా వినియోగం వల్ల ఖర్చు తగ్గుతుందని, నేల ఫలవంతత పెరుగుతుందని, పర్యావరణానికి హానికరం కలగదని చెప్పారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో రైతు వేదికలు, ఫీల్డ్ డెమోల్లో నానో యూరియా ప్రయోజనాలను వివరించాలని, నానో యూరియా వినియోగాన్ని పెంపొందించాలన్నారు. ఈ సీజన్‌లో 1000 ఎకరాల మునగ సాగు లక్ష్యంగా పెట్టుకోవాలని, ఈ పంట ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం లభిస్తుందన్నారు. మునగ సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. అజోల్ల పెంపకం, బయోచార్ తయారీ వంటి పర్యావరణహిత చర్యలు రైతులకు విస్తృతంగా పరిచయం చేయాలని, ఇవి పంటల ఉత్పాదకత పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. అజోల్ల వల్ల పశుగ్రాస సమస్యకు పరిష్కారం దొరకడమే కాకుండా, మట్టిలో మైక్రోబయాలజికల్ జీవ క్రియలు మెరుగవుతాయని వివరించారు. బయోచార్ వాడకం వల్ల నేలలో తేమ నిల్వ పెరిగి, దిగుబడి పెరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీఎస్ఓ అవధాని శ్రీనివాసరావు, డిపిడి ఆత్మ బి. సరిత, మార్క్ఫెడ్ డిఎం సునీత, సొసైటీ సీఈఓలు, వ్యవసాయ శాఖ ఏ డి ఏ లు, ఏవోలు , తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల హృదయంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న ప్రజా నాయకులు కూన వెంకటేష్ గౌడ్

* **బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : పేద ప్రజల హృదయంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న ప్రజా నాయకులు కూన వెంకటేష్ గౌడ్ అని బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. గాజుల రామారం పరిధిలోని కె.వి.ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన "కూన వెంకటేష్ గౌడ్ విగ్రహావిష్కరణ" కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కూన వెంకటేష్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాడంబరుడు, పేదల పాలిటి పెన్నిధి కూన వెంకటేష్ గౌడ్ అని అన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలతో పేదల అభ్యున్నతికై కృషి చేసిన నేత కూన వెంకటేష్ గౌడ్ ప్రజల గుండెల్లో కలకాలం ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, గుబ్బల లక్ష్మీనారాయణ మూసా ఖాన్, ఇమ్రాన్ బేగ్, చెట్ల వెంకటేష్, సమ్మయ్య యాదవ్, హమీద్, శివా నాయక్, జునైద్, ప్రసాద్, వాహీద్, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్స్ అందజేసిన కమిషనర్



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : వర్షాకాలం దృష్ట్యా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్ శైలజ చేతుల మీదుగా మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్స్ అందచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో, సానిటరీ ఇన్స్పెక్టర్ బి. నారాయణ రెడ్డి, జవాన్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తాం

* **ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : డివిజన్ లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని శంషిగుడా లో ఛత్రపతి శివాజీ నగర్ కాలనీ లో డ్రైనేజీ , సీసీ రోడ్ల కు సంబంధించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ ఛత్రపతి శివాజీ నగర్ కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ లోని ఒక గల్లీలో డ్రైనేజీ , మూడు సీసీ రోడ్లు పెండింగ్ ఉన్నాయని అన్నారు. సంబంధిత అధికారులతో ఎస్టిమేషన్ వేయించి, బడ్జెట్ మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని అభివృద్ధి కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, కాలనీ అధ్యక్షులు అంజయ్య యాదవ్, సెక్రటరీ కె.రమేష్, ఆర్.ఆంజనేయులు, కోటేశ్వరరావు, ఎల్.రాజు, పి.పోచయ్య, తాత బాబు, రాజ్యలక్ష్మి, సౌందర్య, అరుణ, కృష్ణవేణి, స్వరూపా, దేవి, యోగేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం

: **ఎస్పీ రోహిత్ రాజు**

* **షీ టీమ్స్ , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కార్యాలయాల్ని సందర్శించిన జిల్లా ఎస్పీ**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకొని వారికి న్యాయం చేయడానికి వీలుగా ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసిన టీజీ డబ్ల్యూ ఎస్ డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేకమైన విభాగమే షీ టీమ్స్ అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని చుంచుపల్లిలో గల షీ టీమ్స్ , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు. ముందుగా షీ టీం , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. మహిళలపై లైంగిక వేధింపులు,ర్యాగింగ్,ఈవ్ టీజింగ్,బ్లాక్మెయిలింగ్, ఇతర ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలు జిల్లా షీ టీమ్స్ ను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.జిల్లా షీ టీమ్స్ ఫోన్ నంబరు 8712682131 కి ఫోన్ చేసి తమ సమస్యని తెలియజేసుకోవచ్చని అన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గొప్యంగా ఉంచబడతాయని అన్నారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే నేరస్తుడిని షీటీం కార్యాలయానికి కి పిలిచి వారి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.పరిస్థితిని బట్టి నిందితుడిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బాలికలకు,మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్స్ ను సంప్రదించాలని తెలియజేసారు. జనాలు రద్దీగా ఉండే ప్రదేశాలలో,రైల్వే స్టేషన్,బస్టాండ్లు , కళాశాలల వద్ద షీ టీమ్స్ సభ్యులు నిరంతరం సంచరిస్తూ ఆకతాయిల ఆగడాలను నిరోధిస్తూ మహిళలకు అండగా నిలవాలని సూచించారు.మానవ అక్రమ రవాణా చేసి వారి అవయవాలను విక్రయించడం,వారితో వెట్టిచాకిరీ చేయించడం,వ్యభిచారంలోకి లాగడం,బాల్య వివాహాలు చేయడం లాంటివి జరగకుండా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది భాద్యతగా పనిచేయాలని సూచించారు.ఇటువంటి నేరాలు జరగకుండా ఉండడానికి నిరంతరం జిల్లా మొత్తం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.మఫ్టీ దుస్తులలో సంచరిస్తూ నేరాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్,షీ టీం సిబ్బంది నిరంతరం సంచరిస్తూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సీఐ రాము,ఏఎస్సై నాగయ్య, షీ టీం సభ్యులు మల్లికాంబ,రాంబాబులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ లో నల్లగొండ జిల్లా రికార్డు

* **భారీ స్థాయిలో బాల కార్మికుల విముక్తి..**



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : పలకా బలపం పట్టి బడిబాట పట్టాల్సిన బాలలను వెట్టి చాకిరీ తోనే బంధీ అయి పోతున్న పసి బాల్యాన్ని తమ చేతులతో ఒడిసి పట్టుకుని వారిని విముక్తుల్ని చేశారు నల్లగొండ జిల్లా పోలీసులు. ఒక్కరుకాదు, ఇద్దరుకాదు ఏకంగా 106 మంది పసిపిల్లల భవితవ్యం అంధకారంలో మునిగిపో కుండా సరికొత్త జీవితాలు అందించారు.కేంద్ర హోంశాఖ ఆదేశాల ప్రకారం రాష్ట్ర పోలీస్ శాఖ నేతృత్వంలో ప్రతీ ఆరు నెలలకొసారి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో బాలకార్మికులు, వ్యభిచార కూపం లో చిక్కుకుపోయిన మైనర్లను, వీధిబాలలను, ఇటుకబట్టీలో నిర్బంధ కార్మికులుగా ఉన్నవారిని, ముష్టి మాఫియా చేతుల్లో బందీలుగా ఉన్నవారిని,ఇండస్ట్రియల్ కంపె నీల్లో పని చేసే వారిని కాపాడేం దుకు ఈ కార్యక్రమాలను చేపడు తున్న విషయం అందరికీ తెలిసిందే.నల్లగొండ జిల్లా పరిధిలోని మూడు సబ్ డివిజన్ లలో ఎస్పీ శరత్ చం ద్ర పవార్ నేతృత్వంలో పోలీస్ శా ఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపా ర్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జి ల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, వివి ధ డిపార్ట్మెంటు అధికారుల సమ న్వయంతో టీమ్ లుగా ఏర్పడి ఒ క్క జూలై నెలలోనే 90 కేసుల్లో 10 6 మంది పిల్లలను రెస్క్యూ చేయడం జరిగింది.వీరిలో 94 మంది బాలలు 12 మం ది బాలికలు వీరంతా ఎక్కువగా ఇ తర రాష్ట్రాలు బీహార్, చత్తీస్గడ్, ఒ రిస్సా, యూపీ , ఆంధ్రప్ర దేశ్ కి చెందిన వారు కావడం గమ నార్హం. బాలకార్మికులతో పనులపై కఠిన చర్యలు.... నల్లగొండ జిల్లా లో బాలల హక్కులను కాపాడాల్సి న బాధ్యత మనందరిపైనా ఉన్నద ని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చే యాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. బాల కార్మికులకు చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వీధి బాలల ను, బాల కార్మికులను చూసినప్పు డు, డయల్ 100 లేదా 1098 లే దా స్థానిక పోలీస్ వారికి సమాచా రం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజ లకు సూచించారు..

## అక్రమంగా ఇసుక ట్రాక్టర్ పట్టివేత




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామ శివారులో మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. ట్రాక్టర్ ఓనర్ పాక రామస్వామి, డ్రైవర్ మామిండ్ల పర్శ రాములను పట్టుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ట్రాఫిక్ నియమ, నిబంధనలు తప్పక పాటించాలి

* **మైనర్లను డ్రైవర్లుగా నియమించుకుంటే కఠిన చర్యలు**
* **అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు**
* **ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ట్రాఫిక్ నియమ, నిబంధనలు తప్పక పాటించాలని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లకు సూచించారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్లు పాటించాల్సిన నియమ, నిబంధనలను సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రతీ ట్రాక్టర్‌కు నెంబర్ ప్లేట్ తప్పనిసరని, ఇన్సూరెన్స్, ఆర్‌సి కలిగి ఉండాలని సూచించారు. మైనర్లను డ్రైవర్లుగా నియమించుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ డ్రైవర్ తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముస్తాబాద్ మండల ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులున్నారు

## గీతాంజలి ఒలింపియాడ్ స్కూల్ లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ లోని గీతాంజలి ఒలింపియాడ్ స్కూల్ ప్రైమరీలో ఇన్వెస్టిచర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. 202526 విద్యాసంవత్సరానికి నూతన విద్యార్థి నాయకుల నియామకం గీతాం జలియన్స్ తమ వార్షిక ఇన్వెస్టిచర్ సెర్మనీ విజయవంతంగా ముగిసిందని గర్వంగా ప్రకటించారు. వివి నగర్ ప్రాథమిక క్యాంపస్‌లో 2025 ఆగస్టు 1న గౌరవప్రదంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుక విద్యార్థి మండలి , వివిధ హౌస్ కెప్టెన్ల అధికారిక నియామకాన్ని గుర్తించింది, వారికి ముఖ్యమైన బాధ్యతలు నాయకత్వ పాత్రలను అప్పగించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ముఖ్య అతిథిగా ప్రముఖ అడిషనల్ డీసీపీ పి. సత్యనారాయణ, ప్రత్యేక అతిథిగా ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ నందిని అగసారా, గౌరవ అతిథిగా చైర్మన్ పి. శ్రీనివాస రావు లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రసంగంలో సమగ్రత ,అంకితభావం నొక్కి చెప్పబడ్డాయి. కొత్తగా నియమించబడిన నాయకులను ఆదర్శప్రాయంగా నడవాలని, సంస్థ విలువలను నిలబెట్టాలని మరియు వారి అన్ని ప్రయత్నాలలో శ్రేష్ఠత కోసం కృషి చేయాలని కోరారు.ఈ వేడుకలో విద్యార్థి నాయకులను అధికారికంగా నియమించడం ఒక ముఖ్యాంశమన్నారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, వారి డిప్యూటీలు , హౌస్ కెప్టెన్‌లకు ముఖ్య అతిథులు , ప్రిన్సిపాల్ బ్యాడ్జ్‌లు , సాష్‌లను ప్రదానం చేశారు. ఎన్నికైన ప్రతి సభ్యుడు, అపారమైన గర్వం , బాధ్యతతో, పాఠశాల నినాదాన్ని నిలబెట్టడానికి, తమ విధులను శ్రద్ధగా నిర్వర్తించడానికి , తమ తోటి విద్యార్థులకు నిష్పక్షపాతంగా , నిబద్ధతతో సేవ చేయడానికి ఒక గంభీరమైన ప్రమాణం చేశారు."ఈ ఇన్వెస్టిచర్ సెర్మనీ కేవలం పదవులను ప్రదానం చేయడం మాత్రమే కాదు, మన యువ నాయకులలో 'సేవకు ముందు స్వీయత' అనే స్ఫూర్తిని , కర్తవ్య భావాన్ని పెంపొందించడం" అని చైర్మన్ పి. శ్రీనివాస రావు అన్నారు. "వారి సామర్థ్యాలపై మాకు అపారమైన నమ్మకం ఉంది, వారు తమ తోటివారికి మార్గదర్శకత్వం వహించి స్ఫూర్తినిస్తారు." అని ప్రిన్సిపాల్ సయ్యద అన్నారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. జూనియర్ విద్యార్థుల మనోహరమైన నృత్య ప్రదర్శన, ఐక్యత , బలాన్ని ప్రదర్శిస్తూ ఆకట్టుకునే పిరమిడ్ షో ప్రేక్షకులను అలరించాయి. అనంతరం కార్యక్రమం జాతీయ గీతంతో ముగిసింది, భవిష్యత్తుపై ఆశావాదం కలిగింది. ఈ ఉత్సాహభరితమైన , సమర్థులైన విద్యార్థి నాయకుల మార్గదర్శకత్వంలో 202526 సంవత్సరం గణనీయమైన వృద్ధి , విజయాలకు ఒక కాలంగా ఉంటుందని హామీ ఇస్తుందన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

*** అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : వర్షకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ , రెవెన్యూ, వైద్య, విద్య శాఖ, ఇతర జిల్లా అధికారులతో ప్రభుత్వ భూములు పరిరక్షణ, వర్షాకాలం వల్ల సంబించే వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అద్దె భవనాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు, తమ పరిధిలో ఖాళీగా వున్న ప్రభుత్వ భూములను గుర్తించి నివేధికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక కమీషన్ ద్వారా కేటాయింబడిన నిధులను వినియోగించుకొని జిల్లాలో ఆరోగ్య కేంద్రాలను నిర్మాణాలు చేపట్టాలన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగునీరు నిల్వకుండా, దోమల నివారణ నిమిత్తం , ఎప్పటి కప్పుడు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా క్రమంతప్పకుడా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తూ, ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా లో నూతనంగా నడుపబడుతున్న పాఠశాలల్లో అన్ని మౌళిక సదుపాయాలు సత్వరమే కల్పించేదుకు చర్యలు తీసుకోవాలిని మున్సిపల్ అధికారులకు సూచించారు. రైతులకు సబ్సిడీ పై అందిస్తున్న ఎరువులను పక్కదారి పట్టకుండా, కొరత లేకుండా అందించడానికి మండలస్థాయిలో అధికారులు ఫెర్టిలైజర్స్ షాపులను ప్రతి వారము తనిఖీలు చేయాలని, ఎరువుల నిల్వల స్టాక్ రిజిష్టర్ ను పరిశీలించాలని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ పథకం కింద అర్హులై ఉండి , 60 సంవత్సరాల లోపు మృతి చెందిన ప్రతి ఒక్కరికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. వనమహోత్సవం ద్వారా జిల్లాలో మొక్కలను నాటే నిర్ధేశించిన లక్ష్యాన్ని నిర్ధేశించిన సమయంలో పూర్తి చేయాలని, అందుకు తగిన విధరంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ ఉన్న ధరఖాస్తును క్షేత్రస్థాయిలో త్వరితగతిని పరిశీలించి. నిర్ధేశించిన వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులలో భూ భారతి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు తగిని చర్యలు తీసుకోవాలని సూచించారు. స్లమ్స్ ఏరియాలను గుర్తించి అక్కడ చిన్న చిన్న ఇళ్లలో ఉండే వారికి ప్రభుత్వప జి ప్లస్ 3,4 అంతస్తులలో పక్కా ఇళ్లు నిర్మించేందుకు తగిన స్థలాలను గుర్తించి నివేదికలను సమర్పించాలని సంబంధిత అదికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్ ఓ హరిప్రియ, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, తహాశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## 3న కొత్తగూడెం లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

*** చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం, హైదరాబాద్ శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం స్థలం రైతు బజార్ పోచమ్మ తల్లి టెంపుల్ కూలీ లైన్ కొత్తగూడెంలో 03వ తేదీ ఆదివారం జరిగే ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందని, ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్ ప్రస్తుతము వాడుతున్న మందులు కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తీసుకొని రాగలరన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్టణ , గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోగలరు. చత్రపతి శివాజీ మహారాజు సేవా సంఘం కమిటీ సభ్యులు రేఖ రాజశేఖర్, పెద్దిరెడ్డి గోపిరెడ్డి, గునిగంటి చందర్, నమ్మి జగదీష్, ఏమునూరు శివ, సుంకు కనకరాజు, తెలంగాణ సురేష్, అత్తులూరి అరుణ్, వనమాల సుదర్శన్, నారాయణ సింగ్, ఈర్ల శ్యామ్ పిలుపునిచ్చారు.

## మంద బలం ఉందని మాట్లాడటం కరెక్ట్ కాదు



సీఎం రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లించుకునే పనిలో పడ్డారని.. రేవంత్ గురుదక్షిణలో భాగంగా చంద్రబాబు, ఢిల్లీ మెప్పు కోసం ప్రయత్నిస్తున్నారని.. రాష్ట్ర ప్రయోజనాలు ఆయనకు పట్టవని.. ఆ ధైర్యం చూసుకొని ఏపీ మంత్రి లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతామని మాట్లాడుతున్నారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. రేవంత్‌రెడ్డి పెదవులు మూసుకోవడం వల్లే చంద్రబాబు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లు అయ్యిందన్నారు.లోపాయికార ఒప్పందం చేసుకొని ప్రాజెక్టు కోసం సహకరిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో పవర్ ఉందని లోకేశ్ ప్రాజెక్టు కట్టి తీరుతం అంటున్నారని చెప్పారు. అయినా.. సీఎం, మంత్రులు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. లోపాయికార ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. చీఫ్ సెక్రెటరీ ఏమో బనకచర్ల అంశంపై చర్చకు రాము అని లేఖ రాస్తారని.. రేవంత్ మాత్రం పాల్గొని, కమిటీ వేసేందుకు ఒప్పుకొని వస్తారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్, బీజేపీ డూడూ బసవన్నలా తలూపుతున్నారని అన్నారు.

**డీపీఆర్ ఎందుకు వెనక్కి వచ్చింది?**

లోకేశ్ అవగాహన లేకుండా మాట్లాడారని.. అధికారం, మంద బలం ఉందని మాట్లాడటం పొరపాటు అని హరీశ్‌రావు అన్నారు. మిగులు జలాలు ఉంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎందుకు డీపీఆర్‌ను వెనక్కి తిప్పి పంపిందని ప్రశ్నించారు. పోలవరం అథారిటీ, గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ, ఎన్విరాన్‌మెంట్ సంస్థలు ఎందుకు బనకచర్ల డీపీఆర్‌ను తిరస్కరించాయని అన్నారు. నాలుగు కేంద్ర సంస్థలు బనకచర్లను తిప్పి పంపింది నిజం కాదా అని నిలదీశారు. మిగులు జలాలు ఉంటే ఏపీకి ఎన్ని, తెలంగాణకు ఎన్ని కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎత్తిపోతలకు పొక్క కొట్టుడో, చిల్లు కొట్టుడో ఉండదన్నారు. ఆనాడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మౌనంగా ఉండటం వల్ల తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. పోతిరెడ్డికి పొక్క పెట్టి నీళ్లు తీసుకుపోయారని ఆరోపించారు.




## ఘనంగా రోటరీ క్లబ్ ఆఫ్.. హైదరాబాద్ హిమాయత్ నగర్ 17వ వార్షికోత్సవం

*** మధు ప్రవీణ్ కుమార్ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హిమాయత్ నగర్ శాఖ 17వ వార్షికోత్సవ వేడుకలు సికింద్రాబాద్‌లోని హోటల్ అమృత క్యాసెల్‌లో గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రోటరీ గవర్నర్ డా. రాంప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 202526 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ కమిటీ బాధ్యతలు చేపట్టింది. మధు ప్రవీణ్ కుమార్ క్లబ్ అధ్యక్షుడిగా, రాహుల్ చౌహాన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ నూతన కమిటీతో పాటు ఏడుగురు కొత్త సభ్యులు క్లబ్‌లో చేరారు.

**సేవా కార్యక్రమాలతో ఆకట్టుకున్న రోటరీ క్లబ్**

వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా, క్లబ్ నూతన అధ్యక్షుడు మధు ప్రవీణ్ కుమార్, ఆయన బృందం ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ డా. రాంప్రసాద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అనేది కేవలం ఒక సంఘం మాత్రమే కాదు, అది సేవా మూర్తుల సమాహారం అన్నారు. కొత్త కమిటీ మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని నమ్మకం ఉందని అన్నారు. అసిస్టెంట్ గవర్నర్ విశ్వనాథ్ మాట్లాడుతూ... సమాజ మార్పులో ప్రతి సభ్యుడి పాత్ర కీలకం అన్నారు. యువ సభ్యుల ద్వారా మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టాలి అని పిలుపునిచ్చారు.క్లబ్ డైరెక్టర్ శ్యామ్ గత 17 సంవత్సరాలుగా సంఘానికి అందిస్తున్న అంకితభావ సేవలను సభ సభ్యులు ఈ సందర్భంగా ప్రశంసించారు. భవిష్యత్తులో విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి విభాగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని డైరెక్టర్లు స్పష్టం చేశారు. హిమాయత్ నగర్ శాఖ సేవా మార్గంలో దృఢంగా ముందుకు సాగుతూ, భవిష్యత్‌లో మరిన్ని మానవతా కార్యక్రమాల ద్వారా సమాజసేవలో ఆదర్శంగా నిలవనుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో క్లబ్ గౌరవ సభ్యులు టి. ఆనంద్, రాకేష్ అల్లాపూర్, మెహర్, మనీష్, డా. స్రవంతి, విక్రమ్, సుధ, సుభశ్రీ, అనిల్ మాలో, మూర్తి తదితరులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హిమాయత్ నగర్ శాఖ సేవా మార్గంలో దృఢంగా ముందుకు సాగుతూ, భవిష్యత్‌లో మరిన్ని మానవతా కార్యక్రమాల ద్వారా సమాజసేవలో ఆదర్శంగా నిలవనుంది

## బైక్ దొంగలా.. లేదా రికవరీ ఏజెంట్లు..?

*** పట్టపగలే బైక్ దొంగతనం.. సీసీ కెమెరాల్లో రికార్డు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి కూలీలైన్ లో బైక్ దొంగతనం జరిగిందా..? లేదా ఏదైనా ఫైనాన్స్ కు సంబంధించిన ఏజెంట్లు బైక్ కిస్తీలు ఎగ్గొడితే బైకును తీసుకెళ్లి రికవరీ ఏజెంట్లా..? గురువారం ఉదయం 7:40 గంటల ప్రాంతంలో ఇంటి ముందే పార్కింగ్ చేసి ఉన్న బైకును ముగ్గురా..! లేదా నలుగురు గుర్తు తెలియని దొంగలు కళ్లెదుటే ఎత్తుకెళ్లారా...? పట్టపగలే సీసీ కెమెరాలు రికార్డు అవుతున్నా, దొంగలు మాత్రం ఏమాత్రం బెదరకుండా, వచ్చి పని ముగించుకుని తుర్రుమని జారుకున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దొంగలను గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం.. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## దేవరయాంజల్ లో కార్డన్ సెర్చ్

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : అసాంఘీక కార్యకలాపాలను నివారించేందుకు పోలీస్ వ్యవస్థ నిర్విరామంగా పని చేస్తుందని మేడ్చల్ జోన్ డిసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ జోన్ పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవరయాంజల్ మల్లన్న కాలనీ ఫేజ్ 2లో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో సీవిల్ పోలీస్, ఎఆర్ పోలీస్, ట్రాఫిక్, ఎస్ఓటి, సీసీఎస్, ఉమెన్ సెఫ్టీ, సుమారు 280 మందితో 620 ఇండ్లలో సోదా చేశారు. 1884 మంది వ్యక్తులను తనిఖీలు చేపట్టినట్లు డీసీపీ తెలిపారు. ఈ తనిఖీలలో ఎలాంటి ఆధారాలు లేకుండ ఉన్న 37 వాహనాలు, 63 అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న సిలిండర్లను , 300 గుట్కా ప్యాకెట్లను, రెండు హుక్కా పాట్స్, 74 లీటర్ల లిక్కర్ను సీజ్ చేసి రౌడీ షీటర్ , ఇద్దరు సస్పెక్ట్లో పాటు ఇద్దరు గంజాయి విక్రయ దారులను అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు 332 వాహనాలను తనిఖీ చేయగా వాటిపై రూ.2 లక్షల 44 వేలు పెండింగ్ చల్లాన్ల ద్వారా సుమారు రూ.లక్షా 4 వేలు చలాన్లను వసూలు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇతర రాష్ట్రాలైన జార్ఖండ్ నుంచి 150 మంది, బీహార్ కు చెందిన 330 మంది, ఉత్తర ప్రదేశ్ 282 మంది, కర్ణాటక 180 మంది, ఒడిశా 175 మంది, ఇతరులు 107 కాగా స్థానికులు 400 మంది ఉన్నట్లు గుర్తించారు.








## నేషనల్ అవార్డు విన్నర్ కాసర్ల శ్యామ్‌కు KTR విషెస్

బలగం సినిమా లో "ఊరు పల్లెటూరు" పాటకి గాను బెస్ట్ లిరిక్స్ కేటగిరీలో పాటల రచయిత కాసర్ల శ్యామ్ కు నేషనల్ అవార్డ్ వరించిన విషయం తెలిసిందే. తాజాగా పాటల రచయిత కాసర్ల శ్యామ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. బలగం సినిమాకు నేషనల్ అవార్డు రావడం రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణం అని అన్నారు. బలగం సినిమాతో దూరమవుతున్న మానవ సంబంధాలను తట్టిలేపారని ప్రశంసించారు. ఎందరో ప్రముఖుల తర్వాత 'ఊరు పల్లెటూరు' పాట రాసిన తనకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అదృష్టంగా భావిస్తున్నానని కాసర్ల శ్యామ్ అన్నారు. వేణు యెల్దండి దర్శకత్వంలో వచ్చిన ఈ బలగం చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.





# రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో ముఖ గుర్తింపు హాజరు 93.35 శాతం నమోదు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత పాటించేలా పాఠశాల విద్యాశాఖ తన పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఆగస్టు 1 నుంచి ముఖ గుర్తింపు హాజరును అమల్లోకి తీసుకొచ్చింది. విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 24,973 ఉండగా అందులో మొత్తం ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కలిపి 1,28,760 మంది ఉన్నారు. కాగా శుక్రవారం ముఖ గుర్తింపు హాజరు ఆప్ ద్వారా 96,327 (75 శాతం) మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 89,922 (93.3 శాతం) మంది తమ హాజరును యాప్ ద్వారా నమోదు చేసుకోగా, 6,405 మంది సిబ్బంది హాజరును గుర్తించలేదు. రాష్ట్రంలోని 33 జిల్లాల వారిగా చూస్తే ఆదిలాబాద్ లో 2403 మంది హాజరుతో 96.16 శాతం హాజరుతో మొదటి స్థానంలో నిలిచింది. సంగారెడ్డి జిల్లాలో 4464 మంది హాజరుతో 95.84 శాతంలో రెండవ స్థానంలో నిలిచాయి. జోగులాంబ గద్వాల్, 1785 ( 95.56 శాతం) మూడవ స్థానం, మహబూబ్ నగర్ లో 3043(95.14 శాతం) మంది హాజరుతో నాల్గవ స్థానం, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 1782 మంది హాజరుతో (95.14 శాతం) వరుసగా 5 స్థానాల్లో నిలిచాయి.

**అత్యల్పంగా పెద్దపల్లిలో:**

కామారెడ్డి, హైదరాబాద్, నిర్మల్, మేడ్చల్



మల్కాజ్ గిరి, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, నాగర్‌కర్నూల్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, నారాయణపేట, సిద్దిపేట, హనుమకొండ, జనగామ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, మెదక్, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిజామాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోనూ హాజరు శాతం 90 శాతానికి పైగా నమోదైంది. కాగా పెద్దపల్లి జిల్లాలో 1944 మంది తో(74.57 శాతంతో) అన్నింటికంటే తక్కువగా నమోదైంది.

## ఉపఎన్నికలు నిర్ణయించేది కేటీఆర్ కాదు.. ఎలక్షన్ కమిషన్: కడియం శ్రీహరి

హనుమకొండ: పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్‌కు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కాలరాసిందే భారత రాష్ట్ర సమితి అని విమర్శించారు. వారి పదేళ్ల పాలనలో పార్టీలు, ఎమ్మెల్యేలను విలీనం చేసుకున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేల అనర్హత అంశంలో స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ఉపఎన్నికలు నిర్ణయించేది



కేటీఆర్ కాదని.. ఎలక్షన్ కమిషన్ అని చురకలు అంటించారు.

## తెలంగాణ, ఈశాన్య భారత సాంకేతిక-సాంస్కృతిక మహోత్సవం.. పోస్టర్ రూపొందిస్తారా?

హైదరాబాద్: తెలంగాణ, ఈశాన్య భారత సాంకేతిక సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని రాజ్‌భవన్ నిర్ణయించింది. హైదరాబాద్‌లో నవంబరు 25 నుంచి 27 వరకు.. డిసెంబరు 2 నుంచి 4 వరకు రెండు విడతల్లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వేడుకకు లోగో, ట్యాగ్‌లైన్, పోస్టర్ రూపొందించాలని రాజ్‌భవన్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నెల 15 వరకు మూడు కేటగిరీల్లో దరఖాస్తులు పంపించాలని గవర్నర్ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తెలిపారు. తెలంగాణ, ఈశాన్య భారత రాష్ట్రాల మధ్య సాంస్కృతిక ఐక్యత, సాంకేతిక ఆవిష్కరణల పరస్పర మార్పిడి భావనలను ప్రతిబింబించేలా లోగో, పోస్టర్, ట్యాగ్‌లైన్ ఉండాలన్నారు. లోగో సొంతంగా తయారు చేసి.. ఎడిట్ చేయగలిగే హై రిజల్యూషన్ పీఎన్‌జీ ఫార్మాట్‌లో ఉండాలని




దానకిశోర్ చెప్పారు. ట్యాగ్‌లైన్.. ఇంగ్లిష్‌లో 10 పదాలకు మించకుండా ఉండాలన్నారు. పోస్టర్.. థీమ్‌కు అనుగుణంగా పీడీఎఫ్ లేదా పీఎన్‌జీ ఫార్మాట్‌లో కనీసం 300 dpi రిజల్యూషన్‌తో సమర్పించాలని సూచించారు. ఎంపికైన ఉత్తమ పోస్టర్‌కు రూ. 20వేలు, లోగోకు రూ. 15వేలు, ట్యాగ్‌లైన్‌కు రూ.5వేలు బహుమతిగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను tel anganano rtheastconnect@gmail.comకు పంపించాలని.. పూర్తి పేరు, మొబైల్ నంబరు ఇతర వివరాలు జతపరచాలన్నారు. పూర్తి వివరాలు రాజ్‌భవన్ అధికారిక వెబ్‌సైట్ www.governor.telangana.gov.inలో చూడొచ్చన్నారు.

## గోదావరి బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుని తీరతాం: హరీశ్‌రావు

హైదరాబాద్: గోదావరి బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆ ప్రాజెక్టును ఎలా ఆపాలో భారత రాష్ట్ర సమితికి తెలుసన్నారు. బనకచర్లను ఉద్దేశించి ఏపీ మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యల నేపథ్యంలో హరీశ్‌రావు స్పందించారు. ''బనకచర్ల గోదావరి ప్రాజెక్టును అడ్డుకుని తీరతాం. ఈ ప్రాజెక్టుపై సీఎం రేవంత్, మంత్రులు ఎందుకు నోరు విప్పట్లేదు. సాగునీటి జలాలపై అవగాహన లేకుండా లోకేశ్ మాట్లాడుతున్నారు. బనకచర్ల డీపీఆర్‌ను కేంద్రం సంస్థలు ఎందుకు తిప్పి పంపాయి? కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లు పెడతామంటే చూస్తూ ఊరుకోం. కాళేశ్వరం ప్రాజెక్టును ఏపీ అడ్డుకోలేదని లోకేశ్



అంటున్నారు. కానీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు చంద్రబాబు 7 సార్లు లేఖలు రాశారు'' అని హరీశ్‌రావు ఆరోపించారు.

# 'ఫాల్కన్' మోసం.. రూ.18 కోట్ల విలువైన ఆస్తులు జప్తు

* **'ఫాల్కన్' మోసం.. రూ.18 కోట్ల విలువైన ఆస్తులు జప్తు**

హైదరాబాద్: ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్ కేసుల్లో సంస్థకు చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. రూ.18.14 కోట్లు విలువైన 12 స్థిరాస్తులను అధికారులు జప్తు చేశారు. మెస్సర్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు అమర్‌దీప్ కుమార్‌పై ఈడీ అధికారుల దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బాధితుల నుంచి పెట్టుబడుల పేరుతో దాదాపు రూ.792 కోట్లు ఈ సంస్థ వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో మోసం చేసి సంపాదించిన అక్రమ ఆస్తులను గుర్తించి వాటిని జప్తు చేస్తున్నారు. ఫాల్కన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమర్‌దీప్ కుమార్‌కు చెందిన హాకర్ 800A విమానాన్ని ఇప్పటికే ఈడీ జప్తు చేసింది.

## కవిత ఏ పార్టీలో ఉందో ఆమెకే తెలియదు: మహేష్ కుమార్ గౌడ్



ఎమ్మెల్సీ కవితపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత ఏ పార్టీలో ఉన్నారో ఆమెకే తెలియదని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం తెరమీదకు వచ్చినప్పుడు కవిత జైలులో ఉన్నారని వ్యాఖ్యానించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం తాను, పొన్నం ప్రభాకర్ ఇతర కాంగ్రెస్ నాయకులు కష్టపడ్డారన్నారు. తాము కష్టపడితే వాళ్లు వీళ్లూ రంగులు పూసుకుంటున్నారని విమర్శించారు. అసలు బీసీలకు 42 రిజర్వేషన్లతో కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. కవిత జెండా రంగు మారింది, గులాబీ నుండి బ్లూ రంగుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. రంగులు మార్చేవారు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక నిబద్ధత ఉందని, కాంగ్రెస్ పార్టీ అంటే ఒక నమ్మకం ఉందన్నారు. కేసీఆర్, హరీష్ రావుల చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్ట్ కట్టారని విమర్శించారు. హరీష్, రావు కేసీఆర్ సంతకం పెడితేనే బనకచర్ల నిర్మాణం జరిగిందన్నారు.

## ములుగు జిల్లాను అడవి జిల్లాగా తీర్చిదిద్దుదాం

ములుగు ప్రతినిధి: నేటి బాలలే రేపటి భావితరాల పౌరుల తరహాలోనే ఈనాటి మొక్కలే రేపటి భారీ వృక్షాలుగా తయారవుతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ని ఏకో పార్కులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఆర్ పి ఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్, టి జి ఎస్ పి 5 వ బెటాలియన్ కమాండెంట్ సుబ్రమణ్యం, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 25 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం ఆశించదగ్గ విషయమని



అన్నారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని పర్యాటక ప్రాంతంతో పాటు దట్టమైన అడవులు ఉండటం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. ఈకో ప్రాంతంలో వాచ్ టవర్, వాక్ ఫాల్స్ ఏర్పాటు చేయడం చెప్పుకోదగ్గ విషయమని, అడవులను రక్షిస్తూనే పచ్చదనాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన గాలి ద్వారా వారి ఆయుష్ పెరుగుతుందని, అడవులను కాపాడే విషయంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ములుగు జిల్లాను అడవి జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఏ పి డి వెంకటనారాయణ, ఎఫ్ ఆర్ ఓ లు, ఎఫ్ డి ఓ లు, రేంజర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతివ్వని పోలీసులు.. MLC కవిత కీలక నిర్ణయం



తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులను కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆమె తలపెట్టిన దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతల దృష్ట్యా అనుమతి ఇవ్వలేమని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా 72 గంటల నిరాహార దీక్ష చేసి తీరుతానని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించబోమని అన్నారు. బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష చేయనున్నట్టు చెప్పారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అన్ని పార్టీలతో వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

## లిక్కర్ పాలసీపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సంచలన ఆరోపణలు

తెలంగాణ లిక్కర్ పాలసీపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో మద్యం షాపు దరఖాస్తు ధర పెంచాలని చూస్తున్నారన్నారు. రూ.2 లక్షల నుండి రూ.3 లక్షలకు పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. లిక్కర్ పాలసీ గడువు ముగియకముందే కొత్త షాపులకు దరఖాస్తులను ఆహ్వానించాలని చూస్తున్నారని ఆరోపించారు. అన్ని గ్రామాల్లో మద్యం షాపులు తెరుస్తున్నారని తెలిపారు. మద్యం మాఫియాను పెంచి పోషించి, కల్లు దుకాణాలు మూసివేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ




కల్లు పేరుతో కుట్ర చేస్తున్నారని అన్నారు. కల్తీ అనేది ఎక్కడా లేదని కేవలం కల్లులోనే ఉందని బూచీగా చూపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన తమను కూడా బాధించిందని, కానీ దాని వెనుక కుట్ర ఉన్నట్టు అనుమానం వస్తుందన్నారు. ఘటన జరిగిన తరవాత ఎక్సైజ్ పాలసీని తీసుకువచ్చారని ఆరోపించారు. మద్య నిషేదం చేస్తామన్నారని, బెల్టు షాపులు తీసేస్తామని చెప్పారని ఒక్క బెల్టుషాపు కూడా తీసివేయలేదన్నారు. ఇప్పుడు టెట్రా ప్యాకులు కూడా తెచ్చే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. కొత్త కొత్త బ్రాండ్లు కూడా తీసుకురావాలని చూస్తున్నారని ఆరోపించారు.



## వాటికి మాత్రమే మేం వ్యతిరేకం.. బీసీ రిజర్వేషన్లకు కాదు

బీసీ రిజర్వేషన్ల అంశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రిజర్వేషన్లు అమలుచేసే అధికారం రాష్ట్రానికి ఉందని అన్నారు. కాంగ్రెస్‌కు చేతకాక కేంద్రంపై నెడుతున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదని చెప్పారు. మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని అన్నారు. దీనిపై పదే పదే కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు.

## నష్టాల్లో ముగిసిన సూచీలు..

### సెన్సెక్స్ 81వేల దిగువకు సెన్సెక్స్



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 585 పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ 203 పాయింట్లు పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాల నేపథ్యంలో మార్కెట్ల పతనం కొనసాగుతోంది. అమెరికా సుంకాల అమలును మరో వారం పొడిగించిన నేపథ్యంలో మార్కెట్‌ల నష్టాల్లో మొదలైంది. చివరి వరకు కోలుకోలేకపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,074.41 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,317.51 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,495.57 కనిష్టానికి తగ్గింది.

చివరకు 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 203 పాయింట్లు పతనమై.. 24,565.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1264 షేర్లు లాభపడగా.. 2582 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా స్టీల్, సిప్లా నష్టపోయాయి. లాభపడిన వాటిలో ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, హీరో మోటోకార్ప్, హెచ్‌యూఎల్, నెస్లే ఉన్నాయి. ఎఫ్ఎంసీజీ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు ఆటో, రియాల్టీ, ఫార్మా, ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, టెలికాం 0.5-2 శాతం క్షీణించి నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం దాకా తగ్గాయి.

## పెరిగిన భారత్ ఫారెక్స్ నిల్వలు..



**న్యూఢిల్లీ:** జులై 25తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 2.703 బిలియన్లు పెరిగి 698.192 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. గత వారంలో నిల్వలు 1.183 బిలియన్లు తగ్గి 695.489 బిలియన్లకు పడిపోయాని పేర్కొంది. విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 588.926 బిలియన్లకు పెరిగాయి. ఆర్‌బీఐ డేటా ప్రకారం.. విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 1.316 బిలియన్లు పెరిగి 588.926 బిలియన్లకు చేరుకున్నాయి. ఈ వారంలో బంగారం నిల్వలు 1.206 బిలియన్లు పెరిగి 85.704 బిలియన్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 126 మిలియన్ డాలర్లు పెరిగి 18.809 బిలియన్లకు చేరుకున్నాయని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య నిధిలో భారతదేశం రిజర్వ్ స్థానం 55 మిలియన్ డాలర్లు పెరిగి 4.753 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

## యూపీఐలో కీలక మార్పులు..

### అమల్లోకి కొత్తరూల్స్..




**న్యూఢిల్లీ:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆగస్టు 1 నుంచి ఎన్‌పీసీఐ కొత్త రూల్స్ అమల్లోకి వచ్చాయి. బ్యాలెన్స్ చెక్, ఆటో పేమెంట్‌కు సంబంధించిన కొన్ని నిబంధనలు మారాయి. ఇవి వినియోగదారులతోపాటు బ్యాంకులు, వ్యాపారులను ప్రభావితం చేయనున్నాయి.

ప్రస్తుతం ఉన్నట్టు అపరిమితంగా కాకుండా ఇకపై రోజులో 50 సార్లు మాత్రమే బ్యాలెన్స్ తనిఖీ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ మీరు రెండు యాప్‌లను వినియోగిస్తుంటే ఈ పరిమితి వేర్వేరుగా ఉంటుంది.

యూపీఐ ఆటోపే లావాదేవీలకు ఎన్‌పీసీఐ నిర్ణీత టైమ్ స్లాట్‌లను నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్లు, ఈఎంఐలు, వినిమయ బిల్లులు లాంటి చెల్లింపులను ఇకపై పగటిపూట ర్యాండమ్‌గా కాకుండా నిర్ణీత సమయాల్లో మాత్రమే ప్రాసెస్‌కు వీలుంటుంది. అవి ఉదయం 10 గంటలకు ముందు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 9.30 గంటల తర్వాతే ప్రాసెస్ అవుతాయి.

ఈ మార్పు వల్ల కస్టమర్లపై ప్రత్యక్ష ప్రభావమేమీ ఉండదు. ఎందుకంటే వారి ఆటో-పేమెంట్లు యథావిధిగా పనిచేస్తాయి. కానీ, వ్యాపారులు మాత్రం తమ పేమెంట్ కలెక్షన్ షెడ్యూళ్లను నిర్దేశిత టైమ్ స్లాట్‌లకు అనుగుణంగా తిరిగి సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐని మరింత ఆధారపడదగినదిగా, ప్రత్యేకించి రద్దీ సమయాల్లో అంతరాయాలకు తావులేకుండా లావాదేవీలు సజావుగా సాగేలా తీర్చిదిద్దడం ఈ మార్పుల లక్ష్యం.

ఒక మొబైల్ నంబర్‌పై ఎన్ని బ్యాంకు ఖాతాలు లింక్ అయ్యాయో 25 సార్లకు మించి చూసుకోలేరు. మీరు ఒక ట్రాన్సాక్షన్ చేసిన తర్వాత అది పూర్తి అయ్యిందా లేదా అనే విషయం తెలుసుకోవడానికి మనం స్టేటస్ చెక్ చేస్తుంటాం. అయితే, ఇచ్చిన కొత్త రూల్స్ ప్రకారం, ఒకే లావాదేవీకి ఎక్కువసార్లు చెక్ చేయడం ఇకపై కుదరదు. మీరు గరిష్ఠంగా 3 సార్లు మాత్రమే స్టేటస్ చెక్ చేసుకునే వీలు ఉంటుంది. అది కూడా 90 సెకన్ల గ్యాప్ఇవ్వాల్సి ఉంటుంది.

మీరు ఎవరికైనా డబ్బు పంపించే ముందు చెల్లింపును స్వీకరించే వారి లేదా మొబైల్ నంబర్ ఎంటర్ చేసిన వెంటనే, ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి పేరు (బ్యాంక్‌లో రిజిస్టర్ చేసిన విధంగా) ఇప్పుడు యాప్‌లో కనిపిస్తుంది. దీనివల్ల పొరపాట్లు తగ్గడంతోపాటు, మోసాలకూ ఆస్కారం ఉండదు.

# సిరాజ్, ప్రసిధ్ వికెట్ల వేట..

### తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఆలౌట్

**ఓవల్:** నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో భారత పేసర్ల ఇంగ్లండ్ బ్యాటర్లకు దడ పుట్టించారు. లంచ్ తర్వాత సంచలన స్పెల్‌తో ఆతిథ్య జట్టును ఆలౌట్ చేశారు. ఓవైపు ప్రసిధ్ కృష్ణ(4-62) మరోవైపు మహ్మద్ సిరాజ్(4-84)ల



విజృంభణతో ఇంగ్లండ్ టీ సెషన్ తర్వాత కుప్పకూలింది. వర్షం అంతరాయం కలిగించిన తర్వాత హ్యారీ బ్రూక్ (53) అర్ధ శతకంతో స్కోర్ వేగం పెంచాలనుకున్నాడు. కానీ, అతడిని బౌల్డ్ చేసిన సిరాజ్ రొనాల్డో తరహాలో సంబురాలు చేసుకున్నాడు. ఓపెనర్ల విధ్వంసంతో శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయిన పోప్ సేన తొలి ఇన్నింగ్స్ 247 కే ముగిసింది. ఇంగ్లండ్ 23 రన్స్ లీడ్‌లో ఉంది.

ఓవల్ టెస్టులో రెండో రోజు రసవత్తరంగా సాగుతోంది. భారత బౌలర్లు పంజా విసరడంతో ఇంగ్లండ్ అనూహ్యంగా ఆలౌట్ అయింది. లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు ముకుతాడు వేసిన పేస్ ద్వయం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. రెండో రోజు తొలి సెషన్లో ఓపెనర్ల బెన్ డకెట్(43), జాక్ క్రాలీ(64)ల విధ్వంసంతో భయపెట్టారు. బౌండరీలతో చెలరేగి తొలి వికెట్‌కు.. 92 రన్స్ జోడించగా ఇంగ్లండ్ భారీ స్కోర్ దిశగా సాగింది. కానీ, లంచ్ తర్వాత ఆతిథ్య జట్టు తడబాటుతో సగం వికెట్లు కోల్పోయింది. లంచ్ తర్వాత భారత పేస్ ద్వయం ప్రసిధ్ కృష్ణ(4-62), సిరాజ్(4-84) జోరుతో ఆతిథ్య జట్టు బ్యాటింగ్ లైనప్ కకావికలమైంది.

### సిరాజ్ జోరుతో..

ఓలీ పోప్(22) జో రూట్(29)లను ఎల్బీగా ఔట్ చేసి ఆతిథ్య జట్టును దెబ్బకొట్టిన మియా భాయ్.. కాసేపటికే కొత్త కుర్రాడు జాకబ్ బెథెల్(6)ను యార్కర్‌తో వెనక్కి పంపాడు. వరుసగా ఏడో ఓవర్ వేసిన అతడు ఆడడానికి ఏమాత్రం వీలులేని బంతితో బెథెల్ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు.



అంతే.. ఇంగ్లండ్ 195కే ఐదో వికెట్ కోల్పోయింది. అప్పటికీ భారత స్కోర్‌కు 28 రన్స్ వెనుకంజలో ఉంది పోప్ సేన. కష్టాల్లో పడిన జట్టును హ్యారీ బ్రూక్(52 ), ఆపద్బాంధవుడు జేమీ స్మిత్(5 నాటౌట్)లు గట్టెక్కించే బాధ్యత తీసుకున్నారు.

కానీ, టీకి ముందు ఒకే ఓవర్లో ప్రసిధ్ కృష్ణ.. స్మిత్, జేమీ ఓవర్టన్‌లను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. బ్రేక్ తర్వాత ధనాధన్ ఆడుతున్న అట్కిన్సన్(11)ను డగౌట్ చేర్చిన ప్రసిధ్ నాలుగో వికెట్ పడగొట్టాడు. కాసేపటికే వర్షం అంతరాయంతో ఆలౌట్ ప్రమాదం తప్పించుకున్న ఇంగ్లండ్‌ను సిరాజ్ వెంటాడాడు. హాఫ్ సెంచరీ బాదిన బ్రూక్‌ను బౌల్డ్ చేసి ఆ జట్టు ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

## విడాకులపై మౌనం వీడిన యజువేంద్ర చాహల్

**న్యూఢిల్లీ:** భారత క్రికెటర్ యజువేంద్ర చాహల్ తన భార్య ధనశ్రీకి విడాకులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఓ దశలో సోషల్ మీడియాలో అందర్నీ అట్రాక్ట్ చేసిన ఆ జంట.. అయిదేళ్ల వివాహ బంధానికి బ్రేకప్ చెప్పింది. ఆ సమయంలో చాహల్ చీటింగ్ చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు ఎలా తన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీశాయో అతను చెప్పాడు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ విషయాన్ని వెల్లడించాడు. చాహల్, ధనశ్రీలు 2020లో పెళ్లి చేసుకున్నారు. కానీ ఇద్దరూ కెరీర్ దృష్ట్యా బ్రేకప్ అయ్యారు. అయిదేళ్లకే విడిపోయారు. అయితే విడాకుల విషయాన్ని కొన్నాళ్లు దాచారు. ఆ సమయంలో చాహల్‌పై చీటింగ్ ఆరోపణలు వచ్చాయి.



విడాకులు తీసుకున్న సమయంలో తనను చీటర్ అని ఆరోపించారని, కానీ తన జీవితంలో ఎవర్నీ చీట్ చేయలేదన్నాడు. తాను అలాంటి వ్యక్తిని కాదన్నాడు. తనకన్నా నమ్మకమైన వ్యక్తి మరొకరు ఉండరన్నాడు. నాతో క్లోజ్‌గా ఉన్నవాళ్ల కోసం నా గుండె నుంచి ఆలోచిస్తానన్నాడు. ఇస్తానే తప్ప, తానేమీ డిమాండ్ చేయనన్నాడు. ఎవరికీ ఏమీ తెలియనప్పుడు, వాళ్లు నిందించడం మొదలుపెట్టారని, అప్పుడు మనం ఆలోచనల్లోకి వెళ్లాల్సి వస్తుందని చాహల్ అన్నాడు.

తనకు ఇద్దరు చెల్లెల్లు ఉన్నారని, వాళ్లతో కలిసి చిన్నతనం నుంచి పెరిగానని, మహిళలను ఎలా గౌరవించాలో తెలుసు అని, వాళ్లను గౌరవించే పద్ధతులను పేరెంట్స్ నేర్పించారని, నా చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచి జీవిత పాఠాలు నేర్చుకున్నానని, తన పేరును మరొకరితో జోడించి రాయడం, అది కేవలం వ్యూవ్స్ కోసం మాత్రమే రాస్తారని చాహల్ తెలిపాడు.

వ్యక్తిగత జీవితంపై ఆరోపణలు రావడంతో తన మానసిక ఆరోగ్యం కొంత ఒడిదిడుకులకు లోనైందన్నారు. ఎన్నో రాత్రులు నిద్రలేకుండా గడిపినట్లు చెప్పాడు. డిప్రెషన్‌లోకి వెళ్లినట్లు తెలిపాడు. కొన్ని సందర్భాల్లో సూసైడ్ చేసుకోవాలన్న ఆలోచనలు వచ్చినట్లు వెల్లడించాడు. జీవితం మీద విరక్తి వచ్చిందని, రోజూ రెండు గంటల పాటు ఏడ్చేవాడినని, కేవలం రెండు గంటలు మాత్రమే నిద్రపోయేవాడినని, అలా 50 రోజులు జరిగిందన్నాడు. క్రికెట్ నుంచి బ్రేక్ తీసుకోవాలనుకున్నానని, క్రికెట్‌లో బిజీగా ఉండడం వల్ల ఏకాగ్రత కుదరలేదన్నాడు. తనకు కలిగిన సూసైడ్ ఆలోచనల్ని తన స్నేహితుడితో షేర్ చేసుకున్నట్లు తెలిపాడు. కొన్ని సందర్భాల్లో భయం వేసిందన్నాడు.

## భారత్‌కు రానున్న స్టార్ సాకర్ ప్లేయర్

### సచిన్, ధోనితో కలిసి బ్యాట్‌పట్టనున్న మెస్సీ..!

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటినా ఆటగాడు లియోనెల్ మెస్సీ త్వరలో భారత్‌లోకి రానున్నాడు. ఈ పర్యటనలో ఫుల్‌బాల్ మ్యాచ్ కాకుండా బ్యాట్‌పట్టి బరిలోకి దిగబోతున్నాడు. టీమిండియా దిగ్గజ ప్లేయర్ సచిన్ టెండూల్కర్, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, స్టార్ ప్లేయర్ విరాట్‌తో కలిసి మ్యాచ్ ఆడనున్నాడు. డిసెంబర్ 14న ముంబయిలోని వాంఖడేలో సెవెన్-ఎ-సైడ్ క్రికెట్ గేమ్‌లో పాల్గొనున్నట్లు తెలుస్తున్నది. మెస్సీ డిసెంబర్ 13 నుంచి 15 ముంబయి, ఢిల్లీ, కోల్‌కతాలో అభిమానులను కలిసేందుకు ఈ ప్రమోషనల్ టూర్ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.



ఈ పర్యటనలో సాకర్ స్టార్ క్రికెట్ మ్యాచ్‌లో ఆడనున్నట్లు సమాచారం. మెస్సీ భారత్‌కు వస్తే ఇది రెండోసారి.

ఇంతకు ముందు 2011లో తొలిసారిగా పర్యటించనున్నాడు. కోల్‌కతా సాల్ట్ లేక్ స్టేడియంలో వెనిజులాతో ఇంటర్‌నేషనల్ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పాల్గొన్నాడు. డిసెంబర్ 14న మెస్సీ వాంఖడేలో జరిగి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని.. ముంబయిలోని వాంఖడే స్టేడియంలో సచిన్, ధోనీ, రోహిత్, విరాట్ తదితర క్రికెటర్ ప్లేయర్లతో కలిసి మ్యాచ్ ఆడే అవకాశం ఉందని ముంబయి క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) వర్గాలు వెల్లడించాయి. ఈవెంట్ కోసం గ్రౌండ్‌ను బుక్ చేసేందుకు ఒక ఏజెన్సీ ఇప్పటికే ఎంసీఏను సంప్రదించిందని.. షెడ్యూల్ ఖరారైతే త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. కోల్‌కతాలో చిన్నారుల కోసం మెస్సీ ఫుట్‌బాల్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో మెస్సీ గౌరవార్థం 'గోట్ కప్' మ్యాచ్‌కు ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా.. కేరళలో అక్టోబర్, నవంబర్‌లో అర్జెంటీనా జట్టు ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనున్నది. ఈ మేరకు అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో కేరళ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ మ్యాచ్ ప్రణాళికలను నిలిపివేసినట్లు సమాచారం.

## మ్యూజియంలో గవాస్కర్, పవార్‌ల

# నిలువెత్తు విగ్రహాలు..

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌పై చెరగని ముద్రవేసిన ఆటగాళ్లకు ముంబై క్రికెట్ సంఘం సముచిత గౌరవం కల్పిస్తోంది. ఈమధ్యే వాంఖడే స్టేడియంలో లెజెండరీ ప్లేయర్లు సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ పేరిట ప్రత్యేక గదిని ప్రారంభించి ముంబై బోర్డు.. ఈసారి విగ్రహాలను ఏర్పాటు చేయనుంది. ఓపెనర్‌గా టీమిండియా విజయాల్లో భాగమైన సన్నీ నిలువెత్తు విగ్రహాన్ని తమ క్రికెట్ అసోసియేషన్ మ్యూజియంలో పెట్టనుంది. బీసీసీఐ మాజీ అధ్యక్షుడైన శరద్ పవార్ స్టాచ్యూను కూడా ఇక్కడే ఆవిష్కరించాలని సంకల్పించింది బోర్డు. ఎంసీఏ మ్యూజియం ప్రవేశం ద్వారంలో.. అంటే లోపలికి అడుగుపెట్టగానే ఇరువురి విగ్రహాలు కనిపించనున్నాయి.

'ఎంసీఏ మ్యూజియంలోకి రాగానే గవాస్కర్, పవార్‌ల నిలువెత్తు విగ్రహాలు సందర్శకులకు స్వాగతం పలుకుతాయి. పవార్ ముంబై క్రికెట్‌లో ఐకాన్ అయితే.. సన్నీ భారత క్రికెట్ గొప్ప ఆటగాళ్లలో ఒకరు. అందుకే.. ఈ ఇద్దరిని గొప్పగా గౌరవించాలనుకున్నాం. గవాస్కర్ నిలువెత్తు విగ్రహం ఆటలో ఆయన అసాధారణ ప్రతిభకు తార్కాణం. రాబోయే రోజుల్లో యు క్రికెటర్లలో స్ఫూర్తి నింపడంలో గవాస్కర్ స్టాచ్యూ కీలకం కానుంది' అని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించాడు.




తనకు ఈ గుర్తింపు లభించడం పట్ల గవాస్కర్ సంతోషం వ్యక్తం చేశాడు.' ముంబై క్రికెట్ సంఘం కల్పిస్తున్న ఈ గౌరవం నా హృదయాన్ని తాకింది. నేను క్రికెటర్‌గా ఎదగడంలో.. భారత జట్టు తరపున ఆడడంలో ఎంసీఏ సహకారం మరువలేనిది. ఆటలో దేశానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు నా శక్తి సామర్థ్యాలను సానబెట్టుకోవడంలో బీసీసీఐ ఎంతో తోడ్పడింది. ఈ గౌరవాన్ని నేను జీవితాంతం సెలబ్రేట్ చేసుకుంటా' అని గవాస్కర్ భావోద్వేగంతో చెప్పాడు.

బీసీసీఐ మాజీ బాస్ అయిన శరద్ పవార్ ప్రస్తుతం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన సొగసైన షాట్లతో కోట్లాది మందిని అలరించిన గవాస్కర్.. 1987లో క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం కామెంటేటర్‌గా ప్రేక్షకులను అలరిస్తున్నాడీ లెజెండ్.




# భగవంత్ కేసరి

**టాకీస్:** ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించింది. డైరెక్టరేట్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ అవార్డులు, భారతీయ సినిమా రంగంలో విశేష కృషిచేసిన చిత్రాలకు, కళాకారులకు రాష్ట్రపతి చేతుల మీదుగా అందించనున్నారు.2023 సంవత్సరానికి గాను 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతల వివరాలను కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ఎల్ మురుగన్‌కు జ్యూరీకి అందజేశారు. 2023 సంవత్సరంలో రూపొందిన సినిమాల సృజనాత్మకత, వైవిధ్యం, సాంస్కృతిక అంశాల ప్రాముఖ్యత ఆధారంగా జ్యూరీ ఈ అవార్డులను ప్రకటించింది. ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం, బాలల చిత్రం వంటి అనేక విభాగాల్లో అవార్డులు ఖరారయ్యాయి.

జాతీయ ఉత్తమ చలన చిత్రంగా 12 ఫెయిల్ అనే చిత్రానికి అవార్డ్ దక్కింది. ఇక జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ ఈ సారి ఇద్దరు నటులకి దక్కింది. షారూఖ్ ఖాన్ ( జవాన్), విక్రాంత్ మస్సే( 12 ఫెయిల్) ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే ( హిందీ)లో రాణీ ముఖర్జీకి అవార్డ్ వరించింది.

ఈ ఏడాది కొన్ని భాషా చిత్రాలు, ప్రాంతీయ సినిమాలు సైతం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడం విశేషం. నూతన దర్శకుల ప్రతిభకు గుర్తింపు లభించడంతో పాటు, అనుభవజ్ఞుల కృషికి గౌరవం దక్కింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలకు పురస్కారాలను అందజేయనున్నారు.




71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ "భగవంత్ కేసరి" కి అవార్డు దక్కగా, హనుమాన్ మూవీకి బెస్ట్ స్టంట్ కోరియోగ్రఫీ నేషనల్ అవార్డు దక్కింది. చిత్రానికి బెస్ట్ యాక్షన్ డైరెక్టర్స్ గా నందు, పృథ్వీ పని చేశారు. ఇక బలగం సినిమాలోని "ఊరు పల్లెటూరు" సాంగ్‌కు నేషనల్ అవార్డు దక్కింది. ఈ గీత రచయిత కాసర్ల శ్యామ్ అవార్డ్ అందుకోనున్నారు.

ఇక ఉత్తమ్ స్క్రీన్ ప్లే-బేబీ (సాయి రాజేష్ నీలం (షేరింగ్))
బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్- బేబీ (పివి ఎన్ఎస్ రోహిత్)
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా సుకృతి వేణి (సుకుమార్ కుమార్తె)-గాంధీ తాత చెట్టు
ఉత్తమ చిత్రం యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్ గేమింగ్ కామిక్-హనుమాన్

**జాతీయ చలనచిత్ర పురస్కాలు:** నాన్-ఫీచర్ విభాగం విజేతలు
**ఉత్తమ డాక్యుమెంటరీ (నాన్-ఫీచర్):** గాడ్ వల్చర్ అండ్ హ్యూమన్ (ఇంగ్లీష్, హిందీ, తెలుగు)
**ఉత్తమ స్క్రిప్ట్ (నాన్-ఫీచర్):** సన్‌ఫ్లవర్స్ వర్ ది ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ)
**ఉత్తమ వాయిస్ ఓవర్ / నరేషన్:** ది స్కేడ్ జాక్-ఎక్స్‌ప్లోరింగ్ ది ట్రీ ఆఫ్ విశెస్ (ఇంగ్లీష్)
**ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్:** ది ఫస్ట్ ఫిల్మ్ ( హిందీ)
**ఉత్తమ ఎడిటింగ్:** మూవీంగ్ ఫోకస్ ( ఇంగ్లీష్)
**బెస్ట్ సౌండ్ డిజైన్:** దుందగిరి కే పూల్ (హిందీ)
**బెస్ట్ సినిమాటోగ్రఫీ:** లిటిల్ వింగ్స్ ( తమిళం)
**ఉత్తమ దర్శకత్వం (నాన్-ఫీచర్):** పీయూష్ ఠాకూర్-ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
స్పెషల్ మెన్షన్స్
నేకల్-క్రానికల్ ఆఫ్ ది ప్యాడీ మాన్ (మలయాళం)-ఎమ్‌కే రమదాస్
ది సీ అండ్ సెవెన్ విలేజెస్ (ఒడియా)-హిమాంశు శేఖర్ కటువా, కదంబినీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్
ఉత్పల్ దత్త-ఉత్తమ చలనచిత్ర విమర్శకుడి అవార్డు (అసామీ)
**ఉత్తమ తమిళ చిత్రం (ఫీచర్):** పార్కింగ్-రామ్‌కుమార్ బాలకృష్ణన్ (దర్శకుడు)
**ఉత్తమ తెలుగు చిత్రం (ఫీచర్):** భగవంత్ కేసరి-అనిల్ రావిపూడి (దర్శకుడు)
**ఉత్తమ గారో సినిమా:** రిమ్డోగిట్టంగా (రాప్చర్) (గారో-ఈశాన్య భారతదేశంలోని గారో భాషలో తీసిన సినిమా)
**ఉత్తమ తాయ్ ఫేక్ సినిమా:** పై టాంగ్: స్టెప్ ఆఫ్ హోప్
**ఫీచర్ ఫిల్మ్ విభాగంలో స్పెషల్ మెన్షన్:** యానిమల్
**ఉత్తమ నాన్-ఫీచర్ చిత్రం:** ది ఫ్లవరింగ్ మాన్ (హిందీ)
**ఉత్తమ కళల/సాంస్కృతిక చిత్రం:** టైమ్‌లెస్ తమిళనాడు (ఇంగ్లీష్).

## చకచకా పెద్ది మూవీ షూటింగ్



**టాకీస్:** కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు-, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్‌తో పాటు, జగపతి బాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.



## అదిరిపోయే లుక్‌లో హెబ్బా పటేల్!

టాకీస్: బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈముద్దుగుమ్మ సొంతం. తన అందంతో ఎప్పుడూ కుర్రకారు మనసు దోచుకునే ఈ చిన్నది, తాజగా డిఫరెంట్ లుక్‌లో దర్శనం ఇచ్చింది. ట్రెడిషనల్ లుక్‌లో సింపుల్‌గా కనిపిస్తూ, ప్రతి ఒక్కరినీ తన వైపుకు లాక్కుంటుంది. మరి మీరు కూడా ఆ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి. టాలీవుడ్ గ్లామర్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అలా ఎలా అనే సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. తన అందంతో ప్రతి ఒక్కరి మనసు దోచేసింది. తర్వాత కుమారి 21 ఎఫ్ సినిమాతో ఎంట్రీ ఇచ్చి కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. అంతే కాకుండా యూత్ కలల రాణిగా మారిపోయింది ఈ బ్యూటీ. అంతలా తన అందంతో మాయచేసింది. ఇక ఈ మూవీ తర్వాత హెబ్బాకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఈడో రకం, వాడో రకం, ఏంజిల్,24 కిస్సెస్, మిస్టర్ వంటి చాలా సినిమాల్లో నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. కానీ ఈ సినిమాలు ఈ బ్యూటీకి అంత హైప్ ఇవ్వలేకపోయాయి. తర్వాత నటించిన ఓదెల రైల్వేస్టేషన్ సినిమాతో మరోసారి తెలుగు అభిమానుల మనసు గెలుచుకుంది ఈ ముద్దుగుమ్మ.

ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు అందరూ ఫిదా అయిపోయారు. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ తాజా తన ఇన్ స్టాలో లేటెస్ట్ ఫొటోస్ షేర్ చేసింది. అందులో సింపుల్ లుక్‌లో చాలా క్యూట్‌గా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.




## నాని 'ది ప్యారడైజ్' గ్యాంగ్‌స్టర్ లుక్ వైరల్..

### 2026లో మోస్ట్ అవైటెడ్ మూవీగా..!

**టాకీస్:** దసరా విజయంతో నేషనల్ లెవెల్‌కి ఎదిగిన నేచురల్ స్టార్ నాని, ఇప్పుడు మరోసారి డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో జట్టుకట్టాడు. ఈ కాంబినేషన్‌లో రూపొందుతున్న కొత్త యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' టాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను నాని కెరీర్‌లోనే అతిపెద్ద బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. 1980-90 సమయంలో హైదరాబాదు గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా, ఈ ప్రాజెక్టను 2026 మార్చి 26న గ్లోబల్‌గా విడుదల చేయనున్నారు. ఇటీవల లీక్ అయిన నాని లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పొడవాటి జుట్టు, గడ్డంతో నాని మాస్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తున్న ఈ లుక్‌కి అభిమానులు ఫిదా అయ్యారు. "ఇది నాని కెరీర్‌లో బెస్ట్ లుక్" అంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది. గతంలో 'దసరా'లో వచ్చిన రఫ్ అండ్ టఫ్ లుక్‌ను మించి ఉండేలా ఈ గెటప్ ఉండడం సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. నాని ఈ సినిమాకోసం ఫిజికల్‌గా చాలా మారిపోయారు. లీన్‌గా, మసిల్డ్ బాడీతో అద్భుతంగా ట్రాన్స్‌ఫామ్ అయిన నాని, ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్, యాటిట్యూడ్‌తో స్క్రీన్‌ను షేక్ చేయబోతున్నారని ఇండస్ట్రీలో టాక్.సినిమాకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

## అజయ్‌గా యోగి ఆదిత్యనాథ్ బయోపిక్

### చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరణ

**టాకీస్:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అజయ్' అనే సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సర్టిఫికెట్ జారీ చేయడానికి సెన్సార్ బోర్డు నిరాకరించింది. యోగి ఆదిత్యనాథ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రాబోతున్న విషయం సెన్సార్ బోర్డు నిరాకరించింది. ఈ సినిమాకి సెన్సార్ ఇవ్వడం కుదరదని వెల్లడించింది. దీంతో ఈ చిత్ర దర్శక, నిర్మాతలు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం దీనిపై విచారణ జరుగబోతుంది. అయితే ఈ పిటిషన్‌పై కోర్టు స్పందిస్తూ.. సెన్సార్ బోర్డును కొన్ని ప్రశ్నలు అడిగింది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చిన నవల




తెలిసిందే. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తుండగా.. యోగి పాత్రలో బాలీవుడ్ నటు-డు అనంత్ జోషి యోగి కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో పరేష్ రావాల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ప్రముఖ రచయిత శాంతను గుప్తా రాసిన 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడానికి ఎనిమిదేళ్లుగా ప్రజలకు అందుబాటు-లో ఉన్నప్పుడు ఎటు-వంటి అభ్యంతరాలు రాలేదు. మరి అదే నవల ఆధారంగా తెరకెక్కిన సినిమాకు ఎందుకు అభ్యంతరాలు వస్తాయి.. సెన్సార్ ఎందుకు నిరకరించారో చెప్పాలంటూ సెన్సార్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. సినిమాకు సెన్సార్ ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై స్పందించిన బోర్డు రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.